క్లుప్తంగా

మానవత్వం చాటుకున్న మహిళ

రాయికల్(జగిత్యాలరూరల్): మండల కేంద్రంలోని ఇటిక్యాల క్రాస్ రోడ్ వద్ద దుకాణం ముందు ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండగా.. దుకాణం యజమాని 108కు కాల్ చేశాడు. 108 వాహనం వారు వచ్చి పరిశీలించి మద్యం మత్తులో ఉన్నాడని వదిలిపెట్టి వెళ్లారు. దీంతో కాలినడకన వెళ్తున్న వస్తాపూర్‌కు చెందిన మహిళ అతన్ని చూసి చలించింది. పక్కింటి వారి వద్దకు వెళ్లి మంచినీరు తీసుకొచ్చి అతన్ని కూర్చోబెట్టి నీరు తాగించింది. సమీపంలో ఉన్న నీడ ప్రాంతానికి చేర్చారు. దీంతో స్థానికులు మహిళ మానవత్వాన్ని చూసి అభినందించారు.

నిరుపేద దివ్యాంగురాలికి చేయూత



నిత్యావసర సరుకులు అందిస్తున్న రమేశ్‌గుప్త

వెల్గటూర్ : నిరుపేద దివ్యాంగురాలికి జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లింబాద్రి చేయూతనందించారు. కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన నిరుపేద దివ్యాంగురాలు రాయించు వాసవి పేదరికం గురించి ఆర్యవైశ్య పేద కుటుంబాల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రమేశ్‌గుప్త లింబాద్రికి సమాచారమందించారు. స్పందించిన లింబాద్రి వారి వివాహ వార్షికోత్సవం సందర్భంగా వాసవికి రూ.2వేల ఆర్థిక సాయంతోపాటు రూ.6వేల విలువైన నిత్యావసర సరుకులను అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. బొంగాని మారుతి, ఎండీ మహమ్మద్, దుర్గం శ్రవణ్, నిమ్మ కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



ప్యాకెట్లను అందజేస్తున్న కమిషనర్

మెట్‌పల్లి: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు గురువారం కమిషనర్ మోహన్ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఎండ తీవ్రత పెరిగినందున కార్మికులు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ ఆధ్వర్యంలో అవసరమైన చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. రత్నాకర్, విష్ణు, ముజీబ్, నిజాం, అశోక్, నరేష్ తదితరులున్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు అల్లీపూర్ విద్యార్థి



బహుమతులతో సుచేందర్‌రావు

రాయికల్(జగిత్యాలరూరల్): జాతీయస్థాయి 2024 అండర్–14 కబడ్డీ పోటీలకు రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి సుచేందర్‌రావు ఎంపికయ్యాడు. ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో జరిగిన కబడ్డీ పోటీల్లో రాష్ట్రం తరపున సుచేందర్‌రావు పాల్గొని తెలంగాణ రాష్ట్ర జట్టును రెండో స్థానంలో నిలిపాడు. ప్రతిభ కనబర్చిన సుచేందర్‌రావును గురువారం గ్రామస్తులు, క్రీడాకారులు అభినందించారు.

మోడల్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

మల్లాపూర్: మోడల్ స్కూల్‌లో 6వతరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో మండల విద్యార్థులు రాష్ట్రస్థాయి ప్రతిభను కనబర్చారు. గురువారం విడుదల చేసిన ఫలితాల్లో మల్లాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సోమగల్ల బాలరాజు రాష్ట్ర 10వ ర్యాంక్, పబ్బ అంబిక 75వ ర్యాంక్ సాధించారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శకుంతలదేవి తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయ బృందం పబ్బ అనిల్, ప్రశాంత్, గౌతమి అభినందించారు.

ఉన్నత ర్యాంకులు అభినందనీయం

ధర్మపురి: ఇటీవల విడుదలైన పదోతరగతి పరీక్షల ఫలితాల్లో ఉన్నత ర్యాంకులు సాధించడం అభినందనీయమని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలోని ఆంగ్లోవేదిక్ ప్రైవేట్ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. గురువారం పాఠశాలను సందర్శించి బొజ్జ తరుణి, చీపిరిశెట్టి రక్షిత, ఎర్రం మైమిత, కాశెట్టి శహర్ష, ఎండీ షరియా, సంగనభట్ల ప్రతిక్షను విప్ అభినందించారు. ఫలితాల్లో బాలికలే ఉత్తమ ర్యాంకులు సాధించారని, రానున్న రోజుల్లో విద్యార్థులు ఉన్నత చదువుల్లో మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయుల కృషిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ తోట శంకర్, కరస్పాండెంట్, డైరెక్టర్లు దినేష్, గట్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

గ్రామాల్లో నీటి పరీక్షలు

- ఇప్పటికే క్లోరోస్కోప్ కిట్లు పంపిణీ
- బాధ్యతలు కార్యదర్శులకు..
- ప్రతీరోజూ చేయాల్సిందే..



నీటిని పరీక్షిస్తున్న అధికారులు

బుగ్గారం: గ్రామాల్లో కలుషిత నీటి సరఫరాతో పలు సందర్భాల్లో ప్రజలు అనేక రకాల రోగాలు, అంటు వ్యాధుల బారిన పడడం పలుమార్లు చోటుచేసుకుంటుంది. ప్రస్తుతం మిషన్ భగీరథ నీటిని గ్రామాలకు సరఫరా చేస్తున్నా.. పలు ప్రాంతాలకు ఇంకా అందడం లేదు. ఈ నేపథ్యంలో స్థానిక నీటి వనరుల ద్వారా గ్రామాల్లో నీటిని సరఫరా చేస్తున్నారు. శుద్ధి చేయబడని ఈ నీటిలో ఉన్న సూక్ష్మజీవులను నిర్మూలించడానికి సాధారణంగా బ్లీచింగ్ పౌడర్‌ను కలిపి సరఫరా చేస్తుంటారు. ఈక్రమంలో పలు సందర్భాల్లో బ్లీచింగ్ పౌడర్ శాతాల్లో హెచ్చుతగ్గులతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ సమస్యను నివారించడానికి ప్రతీరోజూ నీటి పరీక్షలు నిర్వహించి నీటి నాణ్యతను అంచనా వేయడానికి ప్రతీ గ్రామ పంచాయతీకి ప్రభుత్వమే క్లోరోస్కోప్ కిట్లను పంపిణీ చేసింది. వీటితో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రతీరోజూ నీటిని పరీక్షించి ఆ వివరాలను నమోదు చేస్తారు.

నీటి పరీక్షలు ఇలా..

జిల్లా వివరాలు	
మండలాలు	18
పంచాయతీలు	380
ఇళ్ల సంఖ్య	1,99,599
జనాభా	7,90,792

గ్రామ పంచాయతీకి అందజేసిన క్లోరోస్కోప్ కిట్ ద్వారా నీటిలోని క్లోరిన్ శాతాన్ని సులభంగా గుర్తించొచ్చు. ఈ కిట్‌లో ఇచ్చిన పరీక్ష నాళికలోకి 5 మి.లీ. నీటిని తీసుకొని అందులో రియేజెంట్ ద్రావణాన్ని 4 చుక్కలు కలపాలి. అనంతరం సీసాను క్లోరిన్ శాతంతో పోల్చే స్టాండ్‌లో ఉంచి అందులో ఇచ్చిన రంగుతో నీటి రంగును పోల్చడం ద్వారా క్లోరిన్ శాతాన్ని గుర్తించొచ్చు. క్లోరిన్ శాతం 0.3 పీపీఎం నుంచి 1 పీపీఎం లోపుంటే ఆ నీరు సురక్షితం. అంతకు తక్కువైనా.. ఎక్కువైనా ఆ నీరు సురక్షితం కాదు.

మూడు దశల్లో..

ఇళ్లకు సరఫరా చేసే నీటిని మూడు దశల్లో పరీక్షిస్తారు. మొదటగా నీరు విడుదలయ్యే ఓవర్‌హెడ్ ట్యాంకుల వద్ద.. తరువాత గ్రామం మధ్యలో గల కుళాయి వద్ద.. చివరిగా గ్రామంలోని చివరి నల్లా వద్ద నీటిని సేకరించి క్లోరిన్ పరీక్షలు నిర్వహిస్తారు. అందులో వచ్చిన పరీక్ష ఫలితాల ఆధారంగా క్లోరిన్‌ను కలపడం లేదా తగ్గించడం చేస్తారు.

పటిష్ట చర్యలు



గ్రామాల్లో ప్రతీ ఇంటికీ సురక్షితమైన నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగానే ప్రతీ గ్రామ పంచాయతీకి క్లోరోస్కోప్ పరికరాలు అందించాం. వీటి ద్వారా ప్రతీరోజూ గ్రామాల్లో నీటిని పరీక్షించి ఇళ్లకు సురక్షితమైన నీటిని సరఫరా చేస్తున్నారు.

– వివేక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

రాయికల్(జగిత్యాలరూరల్): మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, రావీష్‌రెడ్డి అన్నారు. గురువారం భూపతిపూర్‌లో వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. వేసవిలో చెడు తిరుగుళ్లకు అలవాటు పడకుండా క్రీడల ద్వారా శారీరక, మానసిక దృఢత్వం పెంపొందుతాయన్నారు. శిక్షణ కార్యక్రమం నెల రోజులపాటు ఉంటుందని అన్నారు. 5వతరగతి నుంచి డిగ్రీ చదివే విద్యార్థులు అర్హులన్నారు. విజేత యూత్ వారు క్రీడాకారులకు నెల రోజులపాటు సాయంత్రం స్నాక్స్ అందజేయనున్నట్లు విజేత స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు సోమ రమేశ్‌రెడ్డి తెలిపారు.

క్రీడా శిబిరాన్ని వినియోగించుకోవాలి



విద్యార్థులకు సూచనలిస్తున్న ముత్తయ్యరెడ్డి

మెట్‌పల్లి: వేసవిలో క్రీడా శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో గురువారం శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. క్రీడల్లో నైపుణ్యం పెంచడానికి ప్రత్యేకంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గజెల్లి రాము, కోచ్‌లు ఆల్‌రౌండర్ గంగాధర్, కార్తీక్ ఉన్నారు.

హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం



మాట్లాడుతున్న చొప్పదండి ఎమ్మెల్యే సత్యం



తుంగూర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న జీవన్‌రెడ్డి కోడళ్లు

కొండగట్టు(చొప్పదండి): అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ప్రజలకిచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చడానికి కట్టుబడి ఉన్నామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం అన్నారు. గురువారం తుర్కసిగనర్, నమిలికొండ, శ్రీరాములపల్లి, తిప్పాయిపల్లి, నల్లగొండ గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తరఫున ప్రచారం నిర్వహించారు. మండలంలోని వివిధ పార్టీల నుంచి వచ్చిన నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ స్వర్ణలత, నాయకులు మహిపాల్‌రెడ్డి, చిలువేరి నారాయణ, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల: జీవనన్నకే మీ ఓటేయాలని, అభివృద్ధిని చూడాలని, ప్రస్తుతం అభివృద్ధికి, అహంకారానికి ఎన్నికలు జరుగుతున్నాయని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్, బీజేపీ చేసిందేమీ లేదన్నారు. కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామంలో ఉపాధిహామీ పని ప్రదేశాల వద్ద నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి కోడళ్లు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని అభ్యర్థించారు. ఎంపీపీ మసర్తి రమేశ్, విండో చైర్మన్ పొల్సాని నవీన్‌రావు, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ ఆడెపు మల్లీశ్వరి, రంగు లక్ష్మణ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుడిసె జితేందర్, మండల కోఆప్షన్ సభ్యురాలు బీబా, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధు, సరళ తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం: యామాపూర్ గ్రామంలో ఉపాధిహామీ పనుల వద్ద కాంగ్రెస్ నేత జేఎన్ వెంకట్ ప్రచారం చేశారు. జీవన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు నాగేశ్, మహేశ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలి



జగిత్యాల: ఓటు అభ్యర్థిస్తున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



చిన్నమెట్‌పల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: కేసీఆర్ ప్రభుత్వంలోనే ప్రతి ఇంటికి సంక్షేమం.. ప్రతి వాడలో అభివృద్ధి అందిందని, జగిత్యాలలో ఆదివారం నిర్వహించనున్న కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి గోవర్ధన్‌కు మద్దతుగా గురువారం ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట నాయకులున్నారు.

కోరుట్లరూరల్: మోహన్‌రావుపేట, చిన్నమెట్‌పల్లి, జోగిన్‌పెల్లిల్లో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రచారం నిర్వహించారు. ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఎంపీపీ తోట నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సింగిల్‌విండో చైర్మన్ బండి భూమయ్య, నాయకులు పాల్గొన్నారు.

మల్యాల: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించి కరీంనగర్‌ను అభివృద్ధి చేసిన కరీంనగర్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. మండల కేంద్రంలో గురువారం రాత్రి ప్రచారం చేశారు. మండల అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు రాజేశం, రంజిత్, చందు పాల్గొన్నారు.

పెగడపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఈశ్వర్ చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలని నాయకులు కోరారు. రాజరాంపల్లి, కీచులాటపల్లి గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మల్లారెడ్డి, నరేందర్‌రెడ్డి, రవి, రాజశేఖర్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పని చేస్తేనే గెలుస్తామని యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు బోడ్డు రాజేశ్ అన్నారు. గురువారం సాతారంలో నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు.

గొల్లపల్లి: బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి జరిగిందని, అభివృద్ధికి పాటుపడే పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కొప్పుల కూతురు నందిని పిలుపునిచ్చారు. గోవిందుపల్లె, గుంజపడుగు గ్రామాల్లో ఉపాధిహామీ పని ప్రదేశాల వద్ద, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



సిరికొండలో ప్రచారం చేస్తున్న లోక బాపురెడ్డి, నాయకులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం చెర్లపల్లి, రంగసాగర్ గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఓటేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, నాయకులు నారపాక రమేశ్, మారుతి, రాంచంద్రం, శ్రీనివాస్‌రావు, ప్రభాకర్, సృజన్ తదితరులున్నారు.

కథలాపూర్: ఎన్నో ఉద్యమాలు చేసి ప్రత్యేక రాష్ట్రం తెచ్చిన బీఆర్ఎస్‌కు ఎంపీ ఎన్నికల్లో ప్రజలు మద్దతివ్వాలని రాష్ట్ర కార్యదర్శి లోక బాపురెడ్డి కోరారు. సిరికొండలో పార్టీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఎంపీటీసీ దొప్పల హైమావతి, నాయకులు జలంధర్, ఆకుల నర్సయ్య, మామిడిపెల్లి రవి, ఎండీ ఇక్బాల్, ముంజ దశాగౌడ్, బత్తుల నరేశ్, కిరణ్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను వీడిన బుగ్గారం జెడ్పీటీసీ



మాట్లాడుతున్న రాజేందర్

జగిత్యాల: బుగ్గారం ఎంపీపీ బాదినేని రాజమణి, జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి గురువారం రాజీనామా చేశారు. మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఎంతో సన్నిహితంగా ఉన్న రాజేందర్ పార్టీని వీడటంతో ధర్మపురిలో బీఆర్ఎస్‌కు షాక్‌తగిలినట్లయ్యింది. రాజేందర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కొప్పుల గెలుపు కోసం ఎంతో కృషి చేశానని, అయినా తనను చిన్నచూపు చూశారని, పార్టీని వీడుతుంటే చాలా బాధగా ఉందని పేర్కొన్నారు. త్వరలో తమ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు



ఇబ్రహీంపట్నం: యామాపూర్ గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. శుక్రవారం స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. గ్రామస్తులు, మండల నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న వరప్రసాద్

జగిత్యాలరూరల్: వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేస్తామని సివిల్ సప్లయ్ అధికారి వరప్రసాద్ అన్నారు. గురువారం జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని తక్కళ్లపల్లి, అనంతారం, కల్లెడ, లక్ష్మీపూర్, గోపాల్‌రావుపేట ఐకేపీ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. వ్యవసాయాధికారులు ధ్రువీకరించిన ధాన్యాన్ని వెనువెంటనే కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలిస్తామన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను వెంటనే డాటాలో ఎంట్రీ చేసి పంపిస్తామని అన్నారు. మండలంలోని 22 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 32వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఏపీఎం గంగాధర్, సీసీలు శ్రీనివాస్, మరియ, సాగర్, వీవోఏలు లత, భాగ్యలక్ష్మీ, గోవింద, మీర పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల దొంగ అరెస్ట్

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం అప్పరావుపేటలో జనవరిలో ఒకరి ఇంట్లో చోరీ చేసిన దొంగను అరెస్ట్ చేసినట్లు మల్యాల సీఐ నీలంరవి తెలిపారు. జనవరి 31న గ్రామానికి చెందిన రొండ్ల ప్రమీల ఇంట్లో వరంగల్ అర్బన్ జిల్లా గోపాల్‌పూర్‌కు చెందిన పాశం నవీన్ చొరబడి 40 గ్రాముల బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లాడు. కొడిమ్యాల ఎస్సై సందీప్ జేఎన్టీయూ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఓ ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా వెళ్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా.. నవీన్ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. అతని నుంచి జత వెండి నగలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కథలాపూర్: సిరికొండ శివారు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు.

ఆదర్శనగర్‌లో చోరీ

కోరుట్ల: పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన కస్తూరి పద్మ ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పద్మ ఓ శుభకార్యం నిమిత్తం మెట్‌పల్లికి వెళ్లింది. రాత్రి సమయంలో దొంగలు ఇంటి తాళాలు పగులకొట్టి బీరువాలోని ఐదు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం పద్మ ఇంటికి రాగా.. తాళం పగలగొట్టి ఉంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం..

మల్యాల: మండలంలోని ముత్యంపేట (కొండగట్టు)లో ఇంటిముందు పార్కింగ్ చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. కొండగట్టుకు చెందిన పంజాల మల్లేశం ఈనెల ఒకటిన తన ఇంటి ఎదుట బైక్ పార్కింగ్ చేశాడు. ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదు. మల్యాల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు.

విద్యాసాగర్‌రావే అసలైన భూకబ్జాదారు

కోరుట్ల: కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావే అసలైన భూకబ్జాదారుడని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో సముచిత స్థానం దొరకక, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలకు ఆకర్షితులై పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్న వాళ్లను భూకబ్జాదారులే పార్టీని వీడుతున్నారని పేర్కొనడం సరికాదన్నారు. నాయకులు మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రుల సేవలు ప్రజలకు ఉపయోగపడాలి



నేరెల్ల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న సమియొద్దీన్

ధర్మపురి: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలు ప్రజలకు ఉపయోగపడాలని ప్రోగ్రాం అధికారి ఎన్సీడీ సమియొద్దీన్ సూచించారు. మండలంలోని నేరెల్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీపీ, షుగర్ బాధితులను గుర్తించారు. మానసిక వ్యాధిగ్రస్తులుంటే టెలీ కౌన్సెలింగ్‌కు 1844162నంబర్‌కు కాల్స్ చేయాలని సిబ్బందికి వివరించారు. ప్రతి ఒక్కరికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ కార్డులను అందించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అవంతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్, సూపర్‌వైజర్లు రాజేశం, సతీశ్, సిబ్బంది తదితరులున్నారు.

ప్రజా సంక్షేమం కోరేది బీజేపీయే..




భూషణరావుపేటలో ప్రచారం చేస్తున్న వినోద్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి

కథలాపూర్: దేశ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వారి సంక్షేమం కోరేది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్మల వినోద్‌రెడ్డి అన్నారు. గురువారం భూషణరావుపేట గ్రామంలో బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, నాయకులు గడ్డం రాజారెడ్డి, బెజ్జారపు శివరాం, ముస్కు సాగర్‌రెడ్డి, గజభీంకార్ ప్రవీణ్, రాజాగౌడ్, రాజేశ్, అల్లె లక్ష్మణ్, బస్సీనాయక్, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ సభను విజయవంతం చేయాలి

మల్యాల: కరీంనగర్ పార్లమెంటు అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా ప్రధాని మోదీ వేములవాడలో ఈనెల 8న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. నాయకులు బొబ్బిలి వెంకటస్వామియాదవ్, గాజుల మల్లేశం, నులుగొండ సురేష్, పిల్లి రాజశేఖర్, కొక్కెర శ్రీనివాస్‌యాదవ్, నక్క ఆనందం, బాపు రాకేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలను సందర్శించిన డీఎంహెచ్‌వో



వెల్గటూర్: వెల్గటూర్, అంబరిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌వో శ్రీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. వెల్గటూర్ హెచ్‌సీలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో ఆరోగ్య కేంద్రానికి వచ్చిన పేషెంట్ల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వెల్గటూర్, అంబరిపేట వైద్యాధికారులు శ్రవణ్ కుమార్, లవకుమార్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫాగింగ్ యంత్రాలు పంపిణీ



పంచాయతీలకిచ్చిన ఫాగింగ్ యంత్రం ఇదే..

ఇబ్రహీంపట్నం: మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలను పంపిణీ చేసినట్లు ఎంపీవో కృపాకర్ గురువారం తెలిపారు. ఇబ్రహీంపట్నం, గోదూర్, వర్షకొండ, వేములకుర్తి గ్రామాలకు వీటిని అందజేశామన్నారు. ఒక్కోదానికి రూ.60వేలు వెచ్చించి కొనుగోలు చేశామని చెప్పారు. ఫాగింగ్ యంత్రంతో దోమలను తరిమికొట్టాలని సిబ్బందికి సూచించారు.

బాలుడిని కాపాడిన అగ్నిమాపక అధికారులు



నీటి నుంచి బయటకు తీసుకొస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

జగిత్యాలక్రైం: జగిత్యాలరూరల్ మండలం జాబితాపూర్‌కు చెందిన మల్ల వంశీ(16) బుధవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు ఇంటి వద్ద గల చేదబావిలో పడిపోయాడు. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా రిస్క్ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి బాలుడిని బయటకు తీసి కాపాడారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ మధు, ఆపరేటర్ మల్లేశం, సదయ్య, ఫైర్‌మెన్ ప్రశాంత్, వేణు పాల్గొన్నారు.